# ఆధునిక నీతి కథలు

## పొళ్లూరు నాగేశ్వరరావు

మనోరమ ముగ్గురు పిల్లల తల్లి. వయస్సు మూడు పదులమీద మూడు, నాలుగో! అయితేయేం అప్పుడే విచ్చిన తాజా తెల్లగులాబీలా వుంటుంది. ఆమె అందం, అలంకరణ, ఆకృతి, ఆలోచనలు, హావభావాలు, లావణ్యం, మాటలు, నడక మొదలైన లక్షణాలు ఆమె వయస్సును పదేళ్లు దాస్తాయనడంలో అబ్బురమేమీ లేదు. అందుకే ఆమెకు తన సౌందర్యంపై మక్కువ మెండు! గర్వం జాస్తి; గొప్పభావం ఎక్కువ; విశ్వాసం అధికం.

ఆమె భర్త అర్జునరావు డి పి ఐ. ఆఫీసులో సెక్షన్ ఆఫీసరు. కాని అందంలో, ఆహార విహారాల్లో, వేషభాషల్లో, ఆకృతిలో, మర్యాదా మన్ననల్లో, వర్తమాన కాలపు అలవాట్లలో, ఆలోచనల్లో భార్యకు పూర్తిగా భిన్నం. అసలు వయస్సు ముప్పై అయిదేళ్లయినా నలభై అయిదేళ్ల వాడిలా కనబడతాడు. పైపెచ్చు తలమీద దువ్వెన పెట్టనక్కర్లేదు. అక్కడక్కడ విసిరేసినట్టున్న వెంట్రుకల్ని ఎక్కాలు రానివాళ్లు కూడా లెక్కపెట్టవచ్చు. తుమ్మచెక్క శరీరఛాయ; గుండ్రటి మొహం; ఆ మొహానికి చిన్నగా కనిపించే ముక్కు; పెద్దగా అనిపించే కళ్లు; ఇద్దరూ పక్కపక్కన నిలబడితే అందానికీ, అంద విహీనతకూ వున్న వ్యత్యాసం ఇట్టే బోధపడగలదు. మనోరమ అతన్ని ప్రేమించి పెళ్లిచేసుకోలేదు. ఆమెపై మోజుపడి ఆమె అందానికి ముగ్ధుడై అర్జునరావే ఆమెను కట్నకానుకలు తక్కువకు చేసుకున్నాడు. ఆ విషయాలన్నీ అతను అరటిపండు వొలిచి అరచేతిలో పెట్టినట్టుగా శోభనం నాడే ఆమెకు తెలియజేశాడు. దాంతో మనోరమకు తాను గొప్ప సౌందర్యవతిననే గర్వం గాలిగోపురమంత ఎత్తున పెరిగిపోయింది.

మనోరమ కాపురానికొచ్చిన మూడుమాసాలకు యుడిసిగా ప్రమోషన్ వచ్చింది. మరో మూడేళ్లకు అర్జునరావుకు సెక్షన్ ఆఫీసరు ప్రమోషన్ వచ్చింది. అప్పటికి మనోరమ తన సౌందర్యగరిమతో, అహంభావంతో, ముందు ఆలోచనతో అర్జునరావును వైలెక్స్ చీర కొంగుకు చిల్లరడబ్బులు ముడివేసినట్టు లొంగదీసుకుంది.

తన సౌందర్యపోషక సాధనాలపై సగం జీతం ఖర్చుచేయసాగింది. దాంతో అర్జునరావుకు బల్లకింద చేయి చాపక తప్పలేదు. భర్త పై సంపాదనకు రుచి మరిగిన మనోరమ మంగళగిరి కొండెక్కి కూర్చుంది.

తన అందాన్ని లోకానికి ప్రదర్శించి, సౌందర్యోపాసకుల్ని పిచ్చి వాళ్లను చేయడంలో అనూహ్యమైన విభ్రమానందాన్ని పొందడం అలవాటు

చేసుకొంది. ఆ పద్ధతి అర్జునరావుకు నచ్చలేదు. కాని నోరు తెరచి అదేమని అనే అధికారాన్ని ఆమె ముందు కోల్పోయాడు. నోరు మూసుకొని మూగగా నొచ్చుకోవడానికి అలవాటుపడ్డాడు.

వారంలో రెండురోజులు సాయంత్రాలు షాపింగ్‌కు వెళ్ళేది. ఒక్కొక్కసారి ఆమె కొనే వస్తువుల ఖరీదు కంటే స్కూటర్ పెట్రోల్ ఖరీదు ఎక్కువయ్యేది.

అయితే ఎక్కడకు వెళ్లినా అర్జునరావును తోడుతీసుకెళ్లేది. ఆ భార్యాభర్తల అందచందాల మధ్యవున్న వ్యత్యాసాన్ని నలుగురూ చెప్పుకొంటేనే ఆమె గొప్పదనం బయటపడుతుందిగా! చిన్నపిల్లను అతని చేతికిచ్చి హైహీల్స్ వేసుకొని, ప్రివ్యూకొచ్చిన సినిమా స్టార్‌లా ముందుకు నడిచేది. షాపింగ్ ప్యాకెట్లు అతనిమీద పడేసి యజమానురాలిలా సాగిపోయేది

ఒక్కొక్కప్పుడు అర్జునరావు మహా ఇదిగా అవమానాన్ని ఫీలయ్యేవాడు. కాని పైకి అనే ధైర్యం ఉండేది కాదు. తనకి తానే తిట్టుకొనేవాడు. తాను గడ్డితిని సంపాయిస్తూ, ఫాల్స్ ప్రెస్టీజీతో పెళ్లాన్ని పాడుచేస్తున్నాడనీ, తనపై ఆమెకు నిర్లక్ష్యం ఏర్పడేటట్లు చేసుకున్నాడనీ బాధపడేవాడు.

ఒకరోజు సాయంకాలం సుల్తాన్ బజార్‌లో ఓ సినిమాహాలునుంచి హిందీ సినిమా చూసి స్కూటర్‌మీద వస్తూవుండగా రేసుల్లో ఓ నెల టర్నోవర్‌ను కోల్పోయిన ఓ కుర్ర వ్యాపారి అదురుపాటుగా కారు నడుపుతూ అర్జునరావు స్కూటర్ వెనగ్గా 'డాష్' కొట్టాడు. ముల్లోక సౌందర్యవతియైన మనోరమ ఆ దెబ్బకు స్కూటర్‌మీద నుంచి రబ్బరు బంతిలా రోడ్డు పక్కకు పడి, ఓ రాయికి మొహం కొట్టుకొని మూతి మూడు వంకర్లు తిరిగింది. మొహమంతా రక్తపుమయమైంది ఎర్రని సంజెలా. కాని ఆ కారు తోలిన కుర్రవ్యాపారి బ్రేకుమీద కాలు వేయకుండానే చక్కా వెళ్లాడు, ఫోటో ఫినిష్‌లో ఓడిపోయిన గుర్రాన్ని తల్చుకుంటూ.

మనోరమ మొహం ఆకృతి పూర్తిగా మారిపోయింది. ఆ యాక్సిడెంట్‌తో ఆమె సౌందర్యం దిష్టి తగిలిన గులాబిపువ్వులా అయిపోయింది. మొహంమీద గాయాలు మానడానికి మూడు వారాలు పట్టాయి. కాని రెండు పళ్లు విరగడంతో మూతి వంకరపోయింది. ముక్కు ఎముకకూ దెబ్బ తగలడంతో మొహం కొంచెం భయ కరమైంది. కను బొమలపై మచ్చలేర్పడ్డాయి.

ఆ తర్వాత మనోరమ వారానికి మూడు సినిమాలు చూడడమూ, రెండు సార్లు షాపింగ్‌కు వెళ్లడమూ మానేసింది. ఇంటిపట్టునే వుండి సాయంత్రాలు భర్త రాకకోసం ఎదురుచూడడం మొదలుపెట్టింది. భర్తను ప్రేమగా చూసుకోవడం ప్రధానమని గ్రహించింది.

ఆ స్కూటర్ యాక్సిడెంట్ భార్యకు కనువిప్పు కలిగించిందని అర్జునరావు సంతోషపడ్డాడు. అర్జునరావు ఆమె అందం జారిపోయినందుకు మరో పక్క బాధపడుతూనే.

*తన సౌందర్యంమీద స్త్రీకి గొప్పభావం ఉన్నంతకాలమూ భర్తను గౌరవించడంలో నిర్లక్ష్యం చూపిస్తూనే వుంటుంది.*